

భూ భారతి చట్టం.. మీ ఇంటి చుట్టం

- 18 రాష్ట్రాల చట్టాలను అధ్యయనం చేసి రూపొందించాం
- త్వరలో సాదాబైనామాలను పరిష్కరిస్తాం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ఎలిగేడు మండలం ముప్పిరితోటలో మాట్లాడుతున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



రైతుల భూ సమస్యను పరిష్కరించిన పత్రాలను అందజేస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు

పెద్దపల్లి/ఎలిగేడు, మే 20 (ఆంధ్రజ్యోతి): గతంలో నలుగురు నాలుగు గోడల మధ్యన కూర్చుని ధరణి చట్టాన్ని తీసుక వచ్చినట్లు కాకుండా, 18 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి మీ ఇంటి చుట్టంలా భూభారతి చట్టాన్ని తీసు కవచ్చామని, రాబోయే రోజుల్లో సాదాబైనా మాలను పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీని వాస్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎలిగేడు మండలం ముప్పిరితోటలో భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకవచ్చిన ధరణి చట్టంతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం రాగానే భూభా రతి చట్టంపై అధ్యయనం చేశామని, ప్రజలు మెచ్చే విధంగా భూభారతి చట్టాన్ని తీసుకవచ్చి ఏ ప్రిల్ 14న అరంభించామన్నారు. ఎలిగేడు మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి మండలంలోని 13 గ్రామాల్లో భూసమస్యలపై 1054 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో కొన్నింటిని పరిష్కరించామని జూన్ 2 వరకు పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. ధరణిలో సాదాబైనామా లకు పరిష్కారం చూపకుండానే గత ప్రభుత్వం 9,26,000 దరఖాస్తులు స్వీకరించడంతో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రైతులు చెప్పులు అరిగేలా తిరిగారని, ప్రస్తుతం ఆ అంశం కోర్టులో ఉం దని రాబోయే రోజుల్లో వారి సమస్యలను భూభారతి ద్వారా పరిష్కరి స్తామని స్పష్టం చేశారు. భూములకు భూధార్ కార్డు ఇస్తామని, ఈ నంబర్‌తో ఆన్‌లైన్‌లో భూముల వివరాలు చూసుకోవచ్చని తెలిపారు. గతంలో భూముల రిజిస్ట్రేషన్లకు హద్దులు చూపే వారని, ఇప్పుడు సర్వే చేసిన తర్వాత రిజిస్ట్రేషన్ చేసి ఆ మ్యాపులను పాస్ బుక్‌లో జోడిస్తామన్నారు. ప్రతీ మండలానికి 8 నుంచి 10 మంది రాష్ట్ర వ్యాప్తంగా లైసెన్స్‌డ్ ప్రైవేట్ సర్వేయర్లను నియమిస్తామని, వారికి మూడు మాసాల పాటు శిక్షణ ఇస్తామన్నారు. గతంలో మాదిరిగా యేటా డిసెంబర్ 31 వరకు జమాబంధి లెక్కలు చేసే వారని, ఆ విధానాన్ని మళ్లీ తీసుకు వస్తున్నా మన్నారు. ధరణి వల్ల జరిగిన తప్పులను భూభారతి ద్వారా సవరిస్తా మన్నారు. రైతులు కోర్టుల చుట్టూ తిరగకుండా తమ సమస్యల పరి ష్కారానికి తహసీల్దార్లు, ఆర్డీఓలు, అదనపు కలెక్టర్లకు అధికారాలను ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ భూములు, అటవీ, దేవాదాయ భూములను సర్వే చేసి హద్దులు పెడతామన్నారు. రైతులు కోర్టుల పాలు కాకుండా ఉండేందుకే భూభారతి చట్టాన్ని తీసుకవచ్చామని, గతంలో వలే ధరణిలో సమస్య పరిష్కారానికి వెయ్యి రూపాయల రుసుం తీసుకోమని, రెవెన్యూ అధికారులే ఇళ్ల వద్దకు వచ్చి ఉచితంగా దరఖాస్తు ఫారం ఇస్తారని

(మిగతా 8వ పేజీలో)



సదస్సుకు హాజరైన ప్రజలు

రైతుల భూములను కాపాడేందుకే భూభారతి

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



రూపాయి ఖర్చు లేకుండా న్యాయపరంగా రైతుల భూములను కాపాడేందుకు భూభారతి చట్టాన్ని తీసుక వచ్చామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. గత ప్రభుత్వంలో రెవెన్యూ యంత్రాంగాన్ని దొంగలుగా చిత్రీకరించారని, ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదన్నారు. రెవెన్యూ అధికారులు కూడా బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తికమక అవుతూ ప్రభుత్వంను బదనాం చేయాలని చూస్తున్నారన్నారు. బీజేపీ వాట్సఆప్ యూనివర్శిటీలో అన్ని అబద్దాలనే ప్రచారం చేస్తారని విమర్శిం చారు. ఆపరేషన్ సిందూర్‌కు రాజకీయాలకు అతీతంగా కేంద్ర ప్రభు త్వానికి రాహుల్‌గాంధీ, రేవంత్ రెడ్డి మద్దతు ఇచ్చారన్నారు. గతంలో ఇందిరా గాంధీ అమెరికా నాయకత్వం ఎదిరించి పాకిస్థాన్‌ను యుద్ధంలో చిత్తు చేసి ప్రత్యేకంగా బంగ్లాదేశ్‌ను ఏర్పాటు చేశారని, నేడు అమెరికా ఒత్తిడికి తలొగ్గి రాజీపడటం దురదృష్టకరమని మంత్రి తెలిపారు. గతంలో సాగు నీటి కోసం రైతులు పడే ఇబ్బందులపై ముందు ఉండి పోరాటం చేసిన నాయకులు నేడు ప్రజాప్రతినిధిగా ఉండటం సంతోషం గా ఉందన్నారు. ఎస్సారెస్పీ డి- 83, డి-87 కింద పూర్తి స్థాయి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడంలో ఎమ్మెల్యే కీలక పాత్ర పోషిం చారని అన్నారు. సుల్తానాబాద్, పెద్దపల్లి బైపాస్ రోడ్డు పనులు టెండర్లు పూర్తవుతున్నాయని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయని అన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కృత నిశ్చయంతో ఎమ్మెల్యే పని చేస్తున్నారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 24 గంటలలోగా మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించామన్నారు.

ఆర్థికంగా రాష్ట్రాన్ని బాగు చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యు త్ రాజకీయాలకు అతీతంగా అమలు చేస్తున్నామన్నారు. దేశ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా 57 వేల ఖాళీలను సంవత్సర కాలంలో ప్రజా ప్రభుత్వం భర్తీ చేసిందన్నారు. గత ప్రభుత్వం గ్రూప్ వన్ పరీక్షలు నిర్వహించలేక పోయిందన్నారు. రైతులకు 2 లక్షల పంట రుణ మాఫీ, సన్న రకం వడ్లకు క్వింటాళ్ల 500 రూపాయలు బోనస్, రైతు కూలీలకు 12 వేల రూపాయల ఆర్థిక సహాయం, రైతు భరోసా వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు.

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు

లేబర్ కోడ్ పత్రాల దహనం



లేబర్ కోడ్ పత్రాలను దహనం చేస్తున్న నాయకులు

గోదావరిఖని, మే 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గోదావరిఖనిలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు, లేబర్ కోడ్ పత్రులను దహనం చేశారు. ఆయా గనులు, డిపార్ట్‌మెంట్లపై కార్మికులు ప్ల కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ కార్మికులు అనేక పోరాటాలు, ప్రాణత్యాగాలతో సాధించుకున్న 44కార్మిక చట్టాలను కుదించిందని, దీంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. లేబర్ కోడ్‌లుగా సవ రించడంతో ప్రభుత్వరంగ పరిశ్రమలు లక్షల కోట్ల ఆదాయాన్ని దేశాన్ని సమకూర్చే వనరులను కార్పొరేట్ శక్తులకు అమ్ముకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు హక్కులు లేకుండా చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని, మోదీ ప్రభుత్వం 3వ సారి అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులపై పని ఒత్తిడి పెరిగిందని, నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. నాయకులు ఈదునూరి నరేష్, వెంకన్న, బ్రహ్మానందం, రామకృష్ణ, రాజేశం, బుచ్చమ్మ, శారద, మేరి, రాజేశ్వరి, ఎడ్ల రవికుమార్ పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్జీ-1 పరిధిలోని పలు ఏరియాల్లోని పని స్థలాల్లో కాంట్రాక్టు కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, దేశ వ్యాప్తంగా అన్నీ కార్మిక సంఘాలు టోకెన్ సమ్మెకు పిలుపునివ్వగా దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా జూలై 9కి వాయిదా వేశామన్నారు. నాయకులు సారయ్య, రాజు, ఆదిలక్ష్మి, కోమలత, రోజ, ఇంద్ర, మరియమ్మ, వసంత, కోమల, రాజేశ్వరి, పద్మ, దీక్షకుమారి పాల్గొన్నారు.

సరస్వతి.. నమోస్తుతే

- పుష్కరాలకు కొనసాగుతున్న భక్తుల రద్దీ
- ఆరో రోజు 50 వేల మంది పుణ్యస్నానాలు..
- నదిలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల మోహరింపు...



పుష్కరాల్లో యువతుల పూజలు

7

కాంగ్రెస్-బీఆర్ఎస్ నాయకుల బాహాబాహీ



ధర్మారం మండల కేంద్రంలో ఇరుపార్టీల మధ్య వివాదం

ధర్మారం, మే 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ - బీఆర్ఎస్ మధ్య అభివృద్ధి చర్చల పేరుతో సవాళ్లు-ప్రతి సవాళ్ల విసురుకున్న ఇరుపార్టీలు మంగళవారం చర్చలకు సిద్ధమయ్యాయి. ఈ క్రమంలో మండల కేంద్రంలో గంట పాటు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో చర్చలు జరగనుండగా పాత బస్టాండ్ నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ర్యాలీగా వచ్చారు. వారికి ఎదురుగా కాంగ్రెస్ కార్యకర్తలు దూసుకురావడంతో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమర్, ధర్మారం ఎస్ఐ లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రెండు పార్టీల నాయకులు, కార్యకర్తల వ్యతిరేక నినాదాలతో ధర్మారం మేన్‌రోడ్ స్తంభించిపోయింది. దీంతో గంటపాటు వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఉద్రిక్త పరిస్థితుల మధ్య పోలీసులు ఇరుపార్టీల ముఖ్య నాయకులతో పాటు కార్యకర్తలను సముదాయిస్తు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం రోడ్డుపై నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఇరుపార్టీల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి పూల మాలలు వేసి నినాదాలు చేశారు.

యువత అవకాశాలను వినియోగించుకోవాలి



డీఈఈటీ పనితీరుపై అధికారులతో సమావేశమైన కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): డీఈఈటీ(డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ)ద్వారా వచ్చే అవకాశాలను యువత పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీఈఈటీ పనితీరుపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు, సంస్థలకు వారధిగా పని చేసేందుకు ప్రభుత్వం డీఈఈటీని ఏర్పాటు చేసిందన్నారు. జిల్లాలో డీఈఈటీ ప్లాట్‌ఫారంపై 1810మంది యువత ఉపాధి అవకాశాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. యువత ఉపాధి అవకాశాలు పొందేందుకు డీఈఈటీ ఉపయోగపడుతుందని, జిల్లాలోని నిరుద్యోగ యువత రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. డీఈఈటీ ద్వారా యువతకు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయని, వారి నైపుణ్యాల ఆధారంగా శిక్షణ సంస్థల సమాచారాన్ని విద్యార్థులకు అందుతుందన్నారు. జిల్లా పరిశ్రమల అధికారి కీర్తికాంత్, డీఆర్‌డీఓ కాళిందిని, పాల్గొన్నారు.

బసంత్‌నగర్ టోల్ వద్ద లోకల్ లారీలకు ఫీజు తగ్గింపు

కోల్‌సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారి బసంత్‌నగర్ టోల్ ప్లాజా వద్ద రిటర్న్ ట్రిప్ టోల్ చార్జి తగ్గించేందుకు యాజమాన్యం అంగీకారం తెలిపినట్టు లారీ యజమానుల సంఘం పేర్కొంది. రిటర్న్ ట్రిప్ టోల్ చార్జి లోడ్ లారీ అయినా, ఖాళీ లారీ అయినా రూ.152 తీసుకునేందుకు అంగీకరించారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సహకారం అందించారని లారీ యజమానులు పేర్కొన్నారు. రామగుండం ఏరియా లైన్ లారీ యజమానుల సంఘం, బసంత్‌నగర్ లారీ అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఒప్పందానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బయ్యపు మనోహర్‌రెడ్డి, ముక్కెర శ్రీనివాస్, వాసు, మేకల సదానందం, చంద్రయ్య, మేకల నర్సయ్యలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

31 గంటల తర్వాత ప్రారంభమైన టోల్ వసూల్

పాలకుర్తి,మే 20 (ఆంధ్రజ్యోతి):మండలం పరిధిలోని కన్నాల టోల్ ప్లాజా వద్ద 31 గంటలు గడిచిన అనంతరం టోల్ వసూల్ మంగళవారం సాయంత్రం 5గంటల 45 నిముషాలకు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక లారీ అసోసియేషన్, రామగుండం లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పలు డిమాండ్లతో టోల్ ప్లాజా బూమ్ బారియర్లను ఎత్తి వేయించారు. హెచ్‌కెఆర్ సంస్థ సీజీఎం శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌తో క్యాంపు కార్యాలయంలో జరిపిన చర్చలు సఫలం కావడంతో టోల్ వసూల్ తిరిగి ప్రారంభమైంది.

నిర్వాసితులకు ప్రత్యామ్నాయ స్థలాల కేటాయింపు

కోల్‌సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారి సర్వీస్ రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న షాపులను ఇటీవల నగరపాలక సంస్థ తొలగించింది. షాపులు కోల్పోయిన నిర్వాసితులకు ప్రత్యామ్నాయంగా బస్టాండ్ కాలనీవైపు స్థలాలు కేటాయిస్తున్నారు. మంగళవారం కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్వాసితుల జాబితా అనుగుణంగా మార్కింగ్ చేశారు. పలువురు వ్యాపారులు నిర్మాణాలు ప్రారంభించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. బస్ డిపో వైపు షాపుల నిర్వాహకులు కూడా షాపుల ముందు ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా తీసివేశారు.

యూపీపీఎస్సీ ఫలితాల్లో అవినాష్ రెడ్డి సత్తా



చెరుకు అవినాశ్‌రెడ్డి

పెద్దపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): యూపీపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) నిర్వహించిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ 2024 పరీక్షల ఫలితాల్లో గోదావరిఖనికి చెందిన సింగరేణి కార్మికుడి కుమారుడు చెరుకు అవినాశ్ రెడ్డి సత్తాచాటారు. సోమవారం విడుదలైన ఫలితాల్లో ఆల్ ఇండియాలో 40వ ర్యాంకు సాధించాడు. గోదావరిఖని ఓసీపీ-3లో ఫిట్టర్‌గా పని చేస్తున్న నర్సింహారెడ్డి, రాజమణి దంపతుల కుమారుడు 3వ ప్రయత్నంలో ఐఎఫ్ఎస్ ఫలితాల్లో మెరిశాడు. మూడేళ్లుగా సొంతంగానే సివిల్స్‌కు సన్నద్ధం అవుతున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన గ్రూపు-1 ఫలితాల్లో 61వ ర్యాంకు సాధించారు. యూపీపీఎస్సీ లక్ష్యంగా పెట్టుకుని ప్రిపరేషన్ కొనసాగించి విజయం సాధించడంపై తల్లితండ్రులు, స్నేహితులు సంబరాలు జరుపుకున్నారు.



తల్లిదండ్రులతో అవినాశ్‌రెడ్డి

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై కదలిన అధికారులు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన
- భవన నిర్మాణ అనుమతులు రద్దు



అనుమతులు రద్దు చేస్తూ జారీ చేసిన నోటీసు

మంథని, మే 20 (ఆంధ్రజ్యోతి): మంథని మున్సిపల్ పరిధిలోని విలువైన ప్రభుత్వ భూముల ఆక్రమణ పై మున్సిపల్, రెవెన్యూ అధికార యంత్రాంగంలో కదలికలు మొదలయ్యాయి. ప్రభుత్వ భూములకు రక్షణ కరువు అనే శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు కబ్జాలపై ఆరా తీశారు. కాటారం-మంథని ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న సర్వే నెం. 314లో ప్రభుత్వ భూమిలో రెండు అంతస్తుల్లో భవనం నిర్మించిన కుర్రు సారమ్మకు గతంలో మున్సిపల్ ఇచ్చిన భవన నిర్మాణ అనుమతులను రద్దు చేస్తూ మంగళవారం నోటీసు జారీ చేశామని మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్ తెలిపారు. స్థలం స్వాధీనం కోసం ఈ విషయాన్ని తహసీల్దార్ కార్యాలయం నోటీసులో ప్రదర్శించామన్నారు. సూరయ్యపల్లిరోడ్‌లో, మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారికి ఇరువైపుల పాత పెట్రోల్ పంపు నుంచి కూచిరాజ్‌పల్లి వరకు మున్సిపల్ పరిధిలో విలువైన ప్రభుత్వ భూముల కబ్జాలను గుర్తించి వాటిని తొలగించి భూముల పరిరక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మంథని ఆర్డీఓ, తహసీల్దార్లను ఆదేశించారు. దీంతో వారు ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఆరా తీస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు విలువైన ప్రభుత్వ భూముల్లో ఆక్ర మణలు తొలగించి వాటి పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యాలయంలోనే క్రీడా పరికరాలు

- బోర్డులకే పరిమితమైన గ్రామీణ క్రీడా ప్రాంగణాలు



సూరయ్యపల్లి కార్యాలయంలో ఉన్న క్రీడా సామగ్రి

మంథనిరూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత యవతలో క్రీడా నైపుణాన్ని వెలికి తీయాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితమయ్యాయి. 2022-23లో గ్రామాల్లో క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో మండలంలోని 34 గ్రామ పం చాయతీల్లో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఈక్రీడా ప్రాంగణాల్లో వాలీబాల్, కబడ్డీ, కోర్టులతో పాటు యువత వ్యాయామం చేయటానికి ఐరన్ బార్లను ఏర్పాటు చేశారు. వీటికి క్రీడా పరికరాలను 2023 అక్టోబర్, నవంబర్ నెలల్లో మండల పరిషత్ కార్యాలయానికి అందజేశారు. ఇందులో 34 క్రికెట్ కిట్లు, వాలీబాల్ కిట్లు, డంబెల్ కిట్లను సరఫరా చేయగా వాటిని గ్రామ పంచాయతీలకు అందజేయలేదు. ఎన్నికల కోడ్ కారణంగా పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో వాటిని ఇక్కడే నిల్వ చేశారు. గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడలను వెలికి తీయాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఆదిలోనే నిల్చిపోయింది. దీంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితమే కాగా క్రీడా పరికరాలు కార్యాలయంలోనే నిరుపయోగం పడి ఉన్నాయి. వేసవి కాలంలో వీటిని సంబంధిత గ్రామ పంచాయతీలకు అందజేస్తే యువత వీటిని ఉపయోగించుకుంటారని కోరుతున్నారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

మల్యాల, మే 20(ఆంధ్రజ్యోతి): కొండగట్టు సమీపంలో ఆర్టీసీ బస్సు కారును ఢీకొంది. కరీంనగర్ వైపు నుంచి జగిత్యాలకు వెళ్తున్న కారు అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో వెనుకాల వస్తున్న వరంగల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో కారు వెనుక భాగం దెబ్బతినగా ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.

ఈదురు గాలుల వర్షం

● ఇంటిపై విరిగిపడిన కరెంటు స్తంభం

గంభీరావుపేట మే 20 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలుల వర్షం కురిసింది. అరగంట పాటు ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో ఓ ఇంటిపై విద్యుత్ స్తంభం విరిగిపడింది. విద్యుత్ స్తంభం విరిగిపడ్డ సమయంలో ఆ ఇంట్లో కుటుంబ సభ్యులు ఉన్నారు. దీంతో తృటిలో ప్రమాదం తప్పింది. విద్యుత్ నిలిచిపోవడంతో కాలనీ అంధకారంగా మారింది. విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉందని సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని కాలనీవాసులు తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని ముందే తీసేసి కొత్త స్తంభం ఏర్పాటు చేసినట్లయితే ఇప్పుడు ఇలా జరిగి ఉండేది కాదని కాలనీవాసులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సంబంధిత సెస్ సిబ్బంది విరిగిన పాత స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం కేసు నమోదు


శ్రీనివాస్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అదృశ్యంపై మంగళవారం ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌస్‌ఆఫీసర్ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కోనేటి శ్రీనివాస్(38) ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

రెండు బైకులు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కరీంపేట గ్రామ శివారులో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన సుధాకర్ తన ద్విచక్రవాహనంపై కూతురు సంధ్యతో కలిసి బొమ్మనపల్లికి వెళ్తున్నారు. మొగిలిపాలెం గ్రామానికి చెందిన చిన్నబోయిన రాహుల్ మొగిలిపాలెం నుంచి కొండపలకలకు వస్తుండగా కరీంపేట శివారులో బ్రిడ్జి మూల మలుపు వద్ద రాహుల్ సుధాకర్ బైక్‌ను ఢీకొట్టడంతో సుధాకర్‌కు కుడి కాలికి, తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెల మృతి

కథలాపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలోని అంబారిపేటలో మంగళవారం జవ్వాజి ఆదిరెడ్డి అనే రైతుకు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. గేదెలను గ్రామ శివారులో మేపు కోసం తీసుకు వెళ్లాడు. అనూహ్యంగా ట్రాన్స్‌ఫార్మర్ వైపు మేత కోసం వెళ్లి విద్యుదాఘాతానికి గురైందని రైతు వాపోయాడు. దీంతో లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని బాధిత రైతు పేర్కొన్నాడు. ప్రభుత్వం తనకు నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

●**కథలాపూర్:** మండలంలోని అంబారిపేటలో మంగళవారం జవ్వాజి ఆదిరెడ్డి అనే రైతుకు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. గేదెలను గ్రామ శివారులో మేత కోసం తీసుకెళ్లాడు. అనూహ్యంగా ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళ్లిన గేదె విద్యుదాఘాతానికి గురైందని రైతు వాపోయాడు. దీంతో లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని బాధిత రైతు పేర్కొన్నాడు. నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

దళితబంధు రెండో విడత నిధులు విడుదల చేయాలి

వీణవంక,మే20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళిత బంధు రెండో విడత నిధులను లబ్ధిదారుల అకౌంట్‌ల ఫ్రీజింగ్ ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలని జనతాదళ్ సెక్యులర్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ దళితబంధు పైలట్ ప్రాజెక్ట్ హుజూరాబాద్ నియోజకవర్గంలో గత ప్రభుత్వం మొదలు పెట్టిన లబ్ధిదారులకు మొదటి విడత నిధులు విడుదల చేశాక వివిధ రకాల యూనిట్స్ పెట్టుకుని రెండో విడత నిధులు రాక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో కొటేషన్‌ల పేరిట దళారులు కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల ఫ్రీజింగ్ ఎత్తివేసి వెంటనే దళితులను ఆదుకోవాలని కోరారు.

కొండంత పండుగ..



● కొండగట్టులో ప్రారంభమైన హనుమాన్ జయంత్యుత్సవాలు

● అంజన్నకు ప్రభుత్వం తరపున భద్రాచలం రాములోరి పట్టువస్త్రాలు

● ప్రారంభమైన త్రయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞం

మల్యాల, మే 20(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో మూడు రోజుల పాటు నిర్వహించే హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉత్సవమూర్తులకు స్వస్తి వచనము, రక్షాబంధన ము, దేవతాహవనం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం యాగశాల ప్రవేశం చేశాక స్థాపిత దేవ తారాదన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. యాగశాలలో త్రయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, భద్రాచలం ఈవో రమాదేవి, స్థానాచార్యులు తిరుకోవెల కపీందర్, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేందర్‌ప్రసాద్, రఘు ఉపప్రధాన అర్చకులు చిరంజీవస్వామి, మారుతీ, ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర

కొండగట్టు అంజన్నకు ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, భద్రాచలం రామాలయం నుంచి ఆలయ ఈవో ఎల్. రమాదేవి తదితరులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వైజంక్షన్ నుంచి శోభాయాత్ర నిర్వహించగా పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. కళాబృందాలు 108 దీపాల ప్రదర్శన, ఒగ్గు డోలు, కోలాటం, డప్పు నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాకారుల ప్రదర్శనలతో ఆధ్యాత్మికత ఉట్టిపడింది.

తరలిరానున్న దీక్షాపరులు

గురువారం జరిగే పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల కోసం భక్తులు, అంజన్న దీక్షాపరులు వాహనాలు, కాలినడకన కొండగట్టుకు వస్తున్నారు. మంగళవారం కొండ పైన దీక్షాపరులు సందడి అంతంత మాత్రమే కాగా, బుధవారం సాయంత్రం నుంచి భక్తుల రద్దీ పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. జయంతి సందర్భంగా ఆలయాన్ని, యాగశాలను పూర్తి స్థాయిలో అలంకరించకపోవడంపై పలువురు భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.



కళాకారుల ప్రదర్శనలు




పట్టువస్త్రాలను తీసుకువస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, భద్రాచలం ఈవో రమాదేవి, కొండకు వస్తున్న దీక్షాపరులు, స్వామివారి శోభాయాత్ర

టెక్స్‌టైల్ డిప్లొమా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

- టెస్కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు


మాట్లాడుతున్న టెస్కో జీఎం అశోక్‌రావు

సిరిసిల్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): చేనేత, టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని టెస్కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు అన్నారు. మంగళవారం సిరిసిల్లలో చేనేత జౌళి శాఖ కార్యాలయంలో కొండ లక్ష్మణ్‌బాపూజీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో ప్రవేశాలు పొందే విధి విధానాలు డిప్లొమా కోర్సులు, ఉపాధి మార్గాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అశోక్‌రావు మాట్లాడుతూ 2025 - 26 సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరంలో చేరడానికి చేనేత టెక్స్‌టైల్‌కు సంబంధించి 60 సీట్లు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి పాసైన జనరల్ విద్యార్థులు 15 నుంచి 23 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 15 నుంచి 25 మధ్య వయస్సు కలిగిన విద్యార్థులు చేరవచ్చని వివరించారు. డైరెక్ట్‌గా రెండో సంవత్సరం ఇంటర్ ఎంపీసీ, ఒకేషనల్‌కు సంబంధించిన విద్యార్థులు చేరవచ్చని జనరల్ విద్యార్థులు 15 నుంచి 23 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ 25 సంవత్సరాల లోపు ఉండాలని అన్నారు. ఫీజు సంవత్సరానికి రూ.4,250 ఉంటుందని విద్యార్థులు నెలవారీగా రూ 2500 ఉపకార వేతనాలను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల సోదాలు


బేకరీలో తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ అనూష

జగిత్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని యావర్ రోడ్డులో అటవీశాఖ కార్యాలయం సమీపంలో గల ఓ ప్రముఖ బేకరీలో మంగళవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు సోదాలు నిర్వహించారు. బేకరీలో కాలం చెల్లిన, నాణ్యత లేని ఆహార పదార్థాలను, ఫంగస్ గల ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ అనూష ఆధ్వర్యంలో సిబ్బంది సోదాలు చేశారు. బేకరీలో నిల్వ ఉంచిన పలు ఆహార పదార్థాలను పరిశీలన జరిపారు. అనుమానం గల పలు ఆహార పదార్థాలను ల్యాబ్ పరీక్షల నిమిత్తం తీసుకవెళ్లారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ అనూష మాట్లాడుతూ ప్యాకింగ్‌తో విక్రయించే ప్రతీ ఆహార పదార్థాలు నాణ్యత ఉండాలన్నారు. ప్యాకింగ్‌పై వాటి తయారీ తేదీ, బ్యాచ్ నంబరు, ధర, ఎప్పటివరకు వినియోగించవచ్చన్న తదితర వివరాలను తప్పనిసరిగా ముద్రించాలని సూచించారు. ఈ కార్యక్రమంల ఫుడ్ సేఫ్టీ శాఖకు చెందిన పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని రాస్తారోకో


పొత్తూరులో రాస్తారోకో చేస్తున్న రైతులు

ఇల్లంతకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వెంటనే పూర్తిచేయాలని రైతులు మంగళవారం రాస్తారోకో చేపట్టారు. మండలంలోని పొత్తూరు గ్రామానికి చెందిన రైతులు బస్టాండ్ వద్ద నిరసన చేపట్టగా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు సంఘీభావం ప్రకటించారు. రైతుల రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్దం శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పట్నం అశ్విని‌శ్రీనివాస్, బీఆర్ఎస్ అధ్యక్షుడు కదురు శేఖర్, రైతులు రాజు, నారాయణరెడ్డి, మల్లారెడ్డి, రాజయ్య, నర్సయ్య, గోవర్దన్‌రెడ్డి, సాంబశివరెడ్డి, మోహన్‌రెడ్డి, గౌరయ్య, రాజయ్య, రవి, గుంటి అంజయ్య, సాగర్, రాజమల్లయ్య, మహేష్ పాల్గొన్నారు.

నాసిరకం సరుకులు సరఫరా చేస్తున్న వారిని బ్లాక్ లిస్టులో పెట్టాలి

సుభాష్‌నగర్, మే 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమ, గురుకుల, కళాశాల వసతి గృహాలకు నాసిరకం సరకులు సరఫరా చేస్తున్న వారిని బ్లాక్ లిస్టులో పెట్టాలని కుల వివక్ష పోరాట సమితి జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్స్‌లో విద్యార్థులకు నాసిరకం సరుకులు, సరఫరా చేయడం వల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని ఆరోపించారు. బి అంజయ్య, బి చిరంజీవి, బి సంతోష్ అనే వారు సుమారు అత్యధిక హాస్టళ్లకు కూరగాయలు, చికెన్, పండ్లు, గుడ్లను సరఫరా చేస్తున్నారని తెలిపారు. గతంలో సరఫరా చేసిన కూరగాయలు, పండ్లు, చికెన్, గుడ్లు నాసిరంగా ఉండడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఆరోపించారు. వారిని బ్లాక్‌లిస్టులో పెట్టి వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు.

రెండు గ్రామాల మధ్య చేపల పంచాయతీ

● 23 మందిపై కేసు నమోదు

ఇల్లందకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని మల్యాల, వాగొడ్డురామన్నపల్లె గ్రామాల మధ్య చేపల పంచాయతీలో 23మందిపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్ఐ పిట్ల దిలీప్‌కుమార్ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్యాల, గ్రామ శివారులోని చింతల చెరువులో వాగొడ్డు రామన్నపల్లె గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్థులు చేపలు పట్టుకునేవారు. గత ఏడాది మల్యాల గ్రామస్థులు తమ చెరువులో తామే చేపలు పట్టుకుంటామని వాగొడ్డు రామన్నపల్లె వారిని అడ్డుకున్నారు. దీంతో వాగొడ్డు రామన్నపల్లె గ్రామస్థులు జిల్లా ఫిషరీస్ అధికారుల నుంచి చింతల చెరువులో చేపలు పట్టుకోవడానికి ఆర్డర్ తీసుకువచ్చారు. చెరువులోని చేపలు పట్టడానికి వాగొడ్డు రామన్నపల్లె వారికే హక్కులు ఉన్నాయని తహసీల్దార్ తేల్చిచెప్పారు. ఈ క్రమంలో ఇటీవల వాగొడ్డు రామన్నపల్లెకు చెందిన ముదిరాజ్ కులస్థులు చేపలు పడుతున్న క్రమంలో మల్యాల గ్రామస్థులు అక్కడికి చేరుకొని గొడవ చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి ఇరువర్గాలను శాంతింపజేశారు. తమ చేపల వలలు, 95 వేల రూపాయల విలువ చేసే చేపలను దొంగిలించారని వాగొడ్డు రామన్నపల్లె గ్రామస్థులు మల్యాలకు చెందిన 23మందిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

ఎల్లంపల్లి కాలువ పనులను అడ్డుకున్నరైతు

- నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్


కాలువ పనులు అడ్డుకుంటున్న రైతు దయ్యాల నర్సయ్య

రుద్రంగి, మే 20 (ఆంధ్రజ్యోతి) : తన భూమికి నష్ట పరిహారం ఇవ్వకుండానే ఆధికారులు ఎల్లంపల్లి కాలువ పనులు చేస్తున్నారని దయ్యాల నర్సయ్య అనే రైతు కాలువ పనులను అడ్డుకున్నాడు. మండల కేంద్రం శివారులోని కలికోట సూరమ్మ చెరువుకు వెళ్లే ఎల్లంపల్లి కాలువ పనులు కొనసాగుతున్నాయి. అయితే కాలువ పనులు జరగకుండా నర్సయ్య కాలువ మధ్యలో కూర్చొని నిరసన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా రైతు దయ్యాల నర్సయ్య మాట్లాడుతూ సర్వే నంబర్ 333లో 20 గుంటల భూమి ముంపునకు గురవుతున్నట్లు తెలిపాడు. తమ భూములకు నష్టపరిహారం చెల్లించకుండా కాలువ పనులు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం, ఇప్పటికైనా తనకు నష్టపరిహారం అందించాలని కోరాడు.

కల్వర్టులో పడిపోయిన మినీ కంటైనర్

● అందులోనే ఇరుక్కున్నడ్రైవర్ ● బయటకు తీసిన స్థానికులు


డ్రైవర్‌ను బయటికి తీస్తున్న రెస్క్యూ టీం, స్థానికులు

తిమ్మాపూర్, మే 20, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి- నుస్తులాపూర్ గ్రామాల మధ్యలో గల కల్వర్టును ఓ మినీ కంటైనర్ ఢీకొని కల్వర్టులోకి పల్టీకొట్టి పడిపోయింది. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ కాలు అందులోనే ఇరుక్కుపోవడంతో అతన్ని బయటకు తీసేందుకు సుమారు రెండు గంటలకు పైగా శ్రమించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ప్రైవేటు కొరియర్‌కు సంబంధించిన మినీ కంటైనర్ హైదారాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వస్తున్న క్రమంలో మంగళవారం తెల్లవారు జామున 4.30గంటల ప్రాంతంలో డ్రైవర్ అజాగ్రత్తగా నిద్రమత్తులో వాహనం నడుపుతుండటంతో కొత్తపల్లి- నుస్తులాపూర్ మధ్యలో ఉన్న కల్వర్టులోనికి దూసుకెళ్లి బోల్తాపడింది. గమనించిన స్థానిక రైతులు ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించారు సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ పోలీసులు, ఫైర్, టోల్‌గేట్ సిబ్బంది స్థానికులు కంటెయినర్ నుంచి డ్రైవర్‌ను బయటకు తీసేందుకు చాలా శ్రమించాల్సి వచ్చింది. డ్రైవర్‌ను 108 వాహనంలో కరీంనగర్‌లోని అసుపత్రికి తరలించారు. డ్రైవర్ యాదద్రి జిల్లా, గుండాల మండలం, అనంతరం గ్రామానికి చెందిన చెరుపల్లి సాగర్(29)గా గుర్తించారు.

రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

రాయికల్, మే 20 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మండలంలోని అలూరు గ్రామంలో మంగళవారం సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ యూరియా వాడకాన్ని తగ్గిస్తూ సేంద్రియ వాడకాన్ని ఎక్కువ వినియోగిస్తూ భూమి సారాన్ని పెంచాలని, తద్వారా రైతులు లాభాలు పొందాలని సూచించారు. పచ్చిరొట్టకు సంబంధించిన జనుము, జీలుగ, పెసర, పిల్లి పెసర, అలసంద వంటి వాటిని నేలల్లో వెదజల్లి కలియదున్నాలన్నారు. అప్పుడే భూమిలో సూక్ష్మధాతువులు మంచి పంటను అందించాలంటే సత్తువ గల భూమిని తయారు చేయాలన్నారు. రసాయన ఎరువులతో భూసారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో ముక్తేశ్వర్, జిల్లా రైతు నాయకుడు మెక్కొండ రాంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కారులో ఊపిరాడక యువకుడి మృతి


సిరిసిల్ల క్రైం, మే 20(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని వెంకట్రావునగర్‌కు చెందిన పసునూరి రాజేశ్ (35) అనే వ్యక్తి కారులో ఊపిరాడక మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. పట్టణంలోని వెంకట్రావునగర్‌కు చెందిన రాజేశ్ ఫ్రూటీ, హ్యాపీ ఫిజ్ అనే శీతలపానీయాల హెడ్‌గా పనిచేస్తుంటాడు. ఇదే క్రమంలో ఈ నెల 18న రాత్రి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ శివారులో గల గోదాంకు స్టాక్ వచ్చిందని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి రాజేశ్ బయటకు వెళ్లాడు. ఆ రోజంతా ఇంటికి రాకుండానే సోమవారం ఉదయం 6గంటలకు అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చి మళ్లీ బయటకు వెళ్లిపోయాడు. ఆ తర్వాత తన కారును కొత్త బస్టాండ్ సమీపంలో పార్క్ చేసుకొని మద్యం సేవించి కార్ లాక్ చేసుకొని అందులోనే ఉన్న రాజేశ్ ఊపిరాడక మృతి చెందాడు. అయితే తన భర్త ఇంటికి రాలేదని బయటకు వెళ్లి చూస్తే లేకపోవడంతో అనుమానం వచ్చి సోమవారం రాత్రి 11.30 గంటలకు కారు వద్దకు వెళ్లి చూసేసరికి తన భర్త కారులోనే చనిపోయి ఉన్నాడని గుర్తించి చుట్టుపక్కలవారికి, కుటుంబ సభ్యులకు భార్య బాలమణి సమాచారం అందించింది. గత 2019 నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నాడని, ఇదే క్రమంలో అతిగా మద్యం సేవించడం వల్ల కారులో ఊపిరాడక డీహైడ్రేషన్ వల్ల చనిపోయి ఉంటాడని రాజేష్ భార్య పోలీసలుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నది. తన భర్త మృతికి ఎవరిపై అనుమానం లేదని భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

దొంగ అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో చోరీ చేసి తప్పించుకొని తిరుగుతున్న దొంగను పోలీసులు పట్టుకొని సొత్తును స్వాధీనం చేసుకొని నిందితుడిని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఈరవేణి సత్యనారాయణ హమాలీ పని చేసుకొని జీవిస్తున్నాడు. ఖర్చులకు డబ్బులు సరిపోకపోవడంతో సొంత అవసరాల కోసం ఈజీగా డబ్బులు సంపాదించాలని ప్లాన్ చేశాడు. ఈ క్రమంలో తన ఇంటి దగ్గరలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డాడు. బీరువా తాళం పగలగొట్టి బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పోలీసులు చాకచక్యంగా సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గొల్లపల్లి బస్టాండ్ వద్ద పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి బంగారు లక్ష్మీహారం, నెక్లెస్, రెండు చైన్‌లను స్వాధీనం చేసుకున్నామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. సత్యనారాయణను రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన ఎస్ఐ రమాకాంత్, పీఎస్ఐ లక్ష్మణ్, కానిస్టేబుళ్లు బాబయ్య, రఫీద్, శ్రీనాథ్, శ్రీనివాస్‌లను సీఐ అభినందించారు.


స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


గోదావరికి చీరె సారె సమర్పిస్తున్న భక్తులు




పూజలు చేస్తున్న భక్తులు


నదిలో పుష్కర స్నానం ఆచరిస్తున్న భక్తులు

సరస్వతి.. నమోస్తుతే

- పుష్కరాలకు కొనసాగుతున్న భక్తుల రద్దీ
- ఆరో రోజు 50 వేల మంది పుణ్యస్నానాలు..
- నదిలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల మోహరింపు...

భూపాలపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి నది పుష్కరాలకు భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఎండలను సైతం లెక్కచేయకుండా జనం తరలివచ్చి సరస్వతి అంతర్వాహినిలో పవిత్ర స్నానాలు ఆచరించారు. పుష్కరాల్లో ఆరో రోజైన మంగళవారం దాదాపు 50 వేల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీ శ్వర స్వామిని దర్శించుకున్నారు. రెండు రోజులుగా ఎండల తీవ్రత పెరగడంతో దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఉదయం 12 గంటల లోపు, సాయం త్రం నాలుగు గంటల తర్వాత కాళేశ్వర క్షేత్రానికి తరలి వచ్చి పుష్కరస్నానాలు చేశారు. మూడు రోజులపాటు పోటెత్తిన భక్తుల సంఖ్య రెండు రోజుల్లో కొంత తగ్గినప్పటికీ భక్తులు సెంటిమెంట్ ప్రకారం పుణ్య స్నానాలకు రాలేదని అధికారులు భావిస్తున్నారు.



మంగళవారం అష్టమి కావడంతో సాధారణంగానే ఇక్కడ పిండ ప్రదాన కార్యక్రమాలను నిలిపివేస్తారు. గురువారం నుంచి భక్తుల సంఖ్య మళ్లీ పుంజుకునే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు గత మూడు రోజుల్లో ఉత్పన్నమైన సమస్యలను పునరావృతం కాకుండా చూసేందుకు ముందస్తు చర్యలు ప్రారంభించారు. ముఖ్యంగా సరస్వతీ ఘాట్‌కు వెళ్లే దారిని మరింత విస్తరించి రేలింగ్ చేశారు. భక్తులరాక వల్ల రోడ్డు పై దుమ్మురేగకుండా ట్యాంకర్ల ద్వారా నీళ్లను చల్లు తూ క్యూరింగ్ చేస్తున్నారు. మంగళవారం పుష్కరాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎండ వేడి నుంచి రక్షణ కలిగించేలా చలువ పం దిళ్ల, తాగునీరు, ఉచితంగా మజ్జిగ ప్యాకెట్ల పంపి ణీని జిల్లా అధికార యంత్రాంగం చేపట్టింది. కలెక్టర్ రాహుల్ శర్మ పుష్కరాలు జరుగుతున్న ఘాట్లలో తిరుగుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఎస్పీ కిరణ్ ఖరే ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా వాహనాల రాకపోకలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించారు. పుష్కరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడడం కోసం ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీసీ కెమెరాల ద్వారా పరిస్థితులను సమీక్షిస్తూ పోలీసు అధికారులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు సలహాలు అందించారు.

మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి సృజన, ఇంటెలిజెన్స్ బ్యూరో ఐజీ తరుణ్ జోషి తదితరులు నదిలో పుణ్యస్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గోదావరిలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా నివారించడం కోసం అధికార యంత్రాంగం నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫోర్స్(ఎన్‌డీఆర్‌ఎఫ్), సింగరేణి రెస్క్యూ బృందాలను, గజ ఈతగాళ్లను పుష్కర ఘాట్‌లో మోహరించారు.



ఏఎస్సైలకు పదోన్నతులు

కరీంనగర్ క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్‌లో పలు పోలీస్ స్టేషన్‌లలో ఏఎస్సైలుగా పని చేస్తున్న తొమ్మిది మందికి ఎస్సైలుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు పోలీసుశాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. మల్టీజోన్ నుంచి మొత్తం 22 మంది ఏఎస్సైలు పదోన్నతులు పొందారు. వీరందరిని ప్రస్తుతం జిల్లాలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే పోలీస్ స్టేషన్ల కేటాయింపు, పోస్టింగ్‌లు వెలువడనున్నాయి.

డిగ్రీ పరీక్షల్లో 8 మంది డీబార్

గణేశ్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం మాల్ ప్రాక్టీస్ చేసిన ఎనిమిది మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. వాగేశ్వరి డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో నలుగురు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెద్దపల్లిలో ఒకరు, వాణినికేతన్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, శివాని డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఇద్దరి చొప్పున డీబార్ చేసినట్లు వివరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కరీంనగర్ క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని పద్మ నగర్ పరిధిలో మానేరు జలాశయం నీటి గుంతలో గుర్తుతెలియని వ్యక్తి (40) మృతదేహం లభ్యమైందని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. నీటి గుంతలో వ్యక్తి మృతదేహం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని మంగళవారం రాత్రి బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చల్లగా చూడమ్మా..

- బద్ది పోచమ్మకు బోనం మొక్కులు
- క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారికి భక్తులు మంగళవారం బోనం మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు బద్ది పోచమ్మ అమ్మ వారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఉదయాన్నే భక్తులు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా అమ్మ వారి ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలతో గంటల తరబడి భక్తులు క్యూలైన్‌లో బారులు తీరి ఆలయంలోకి ప్రవేశించారు. అమ్మవారికి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుని నైవేద్యాన్ని సమర్పించి పిల్లాపాపలు పాడిపంటలు చల్లగా ఉండాలని వేడుకున్నారు.


అమ్మవారి దర్శనం కోసం బోనాలతో క్యూలైన్‌లో నిరీక్షిస్తున్న భక్తులు

చిన్నకలువలలో సీతారాముల కల్యాణం

సుల్తానాబాద్, మే 20: (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకలువల సంకట విమోచన వీరహన్‌మాన్ ఆలయంలో మంగళవారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త వంగపల్లి సుగుణాకర్‌రావు అనసూయ దేవిదంపతుల ఆధ్వర్యంలో సత్యనారాయణచార్యులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం కల్యాణం జరగగా సాయంత్రం హవనము, బలిహరణము, తీర్థగోష్టి నిర్వహించారు. బుధవారం ఆలయ ఆవరణలో సీతారామచంద్ర స్వాముల పట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం జరిగే హన్‌మాన్ పెద్ద జయంతి వేడుకలకు భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.


స్వామివారి ఉత్సవమూర్తులు

బాక్సింగ్‌లో సత్తా చాటుతాం

- ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం
- 55 మంది క్రీడాకారుల హాజరు




బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న బాలబాలికలు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 20 (ఆంధ్రజ్యోతి): బాక్సింగ్ రింగ్‌లో పంచ్ పవర్ చూపించడ మంటే సాధారణ విషయం కాదు. అలాంటి క్రీడలో అరితేరాలంటే ముందుగా ధైర్య సాహసాలు అలవర్చుకోవాలి. మంచి కండ పుష్టి కలిగి ఉన్నవారే బాక్సింగ్‌లో రాణిస్తారు. ఇటీవల కాలంలో ఒలింపిక్స్‌లో మేరీకోమ్, లవ్లీనా, విజేందర్ ప్రత్యర్థులను మట్టి కరిపించి పతకాలు సాధించారు. తెలుగు తేజం నిఖత్ జరీన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకుంది. దీంతో బాక్సింగ్ క్రీడ గ్రామస్థాయికి చేరింది. వేసవి క్రీడాశిబిరాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో బాక్సింగ్‌లో శిక్షణ అందిస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రంలోని అనేక మంది చిన్నారులు శిక్షణ పొందుతూ ప్రతిభ చాటుతున్నారు. కోచ్‌లు జి.సత్యనారాయణ, కొత్తకొండ సంపత్, జి.మురళి చిన్నారులను శిబిరంలో శిక్షణ ఇస్తున్నారు.

55 మంది చిన్నారుల హాజరు

కరీంనగర్ నగరపాలక సంస్థ, జిల్లా క్రీడా శాఖ సంయుక్తంగా కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి బాక్సింగ్ క్రీడా శిక్షణ శిబిరానికి 55 మంది క్రీడాకారులు హాజరవుతున్నారు. వీరికి కోచ్‌లు అధునాతనమైన టెక్నిక్స్ నేర్పిస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణ అందిస్తున్నారు.

నిఖత్ జరీన్ రోల్ మోడల్ జి.హరిణిశ్రీ, కరీంనగర్



బాక్సింగ్ అంటే చాలా ఇష్టం. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్ నాకు రోల్ మోడల్. ప్రపంచ చాంపియన్‌గా నిలిచి అందరి అభిమానాన్ని చూరగొంది. నేను కూడా ఆమెలా బాక్సింగ్ నేర్చుకుంటాను. అంతర్జాతీయ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించేందుకు కృషి చేస్తా.

మంచి బాక్సర్‌గా ఎదుగుతా జి.హరిహరన్, కరీంనగర్



మంచి బాక్సింగ్ క్రీడాకారుడిగా ఎదగాలన్నదే నా లక్ష్యం. అందు కోసం ఈ వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాల్లో బాక్సింగ్‌ను ఎంచుకున్నాను. కోచ్‌లు శిక్షణలో మెళకువలను నేర్పిస్తున్నారు. ఉచిత వేసవి శిబిరాలను నిర్వహిస్తున్న నగరపాలక సంస్థకు ధన్యవాదాలు.





పెట్రోల్ బంక్‌ల్లో పలు సేవలు

సౌకర్యాలు పొందడం వినియోగదారుల హక్కు

ఇల్లందకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో డీజిల్, పెట్రోల్ కొట్టించుకోకపోయినా కొన్ని సేవలను వినియోగదారులు ఉచితంగా పొందవచ్చు. పెట్రోల్ బంక్‌కు వెళ్లినప్పుడు చాలా మంది తమ వాహనాలను ఇంధనం నింపించుకోవడమే కానీ అక్కడ అందుబాటులో ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయని తెలుసుకోరు. అంతేకాకుండా కొన్నిసార్లు బంక్ సిబ్బంది దురుసుగా ప్రవర్తించడం, గాలి నింపడం కోసం డబ్బులు వసూలు చేయడం వంటివి చేస్తుంటారు.

- వాహనాల టైర్లలో గాలి నింపే మిషన్ తప్పనిసరిగా ఉండాల్సిందే. అక్కడ నిరంతరం ఒక వ్యక్తి అందుబాటులో ఉండి ఉచితంగా సేవలందించాలి. కస్టమర్ తన ఇష్టానుసారం ప్రకారం డబ్బులు ఇవ్వవచ్చు. డబ్బులు డిమాండ్ చేయరాదు.
- స్త్రీలకు ప్రత్యేకమైన మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలి. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ప్రతి బంక్‌లో శుభ్రమైన మరుగుదొడ్లు ఉండాలి.
- తాగునీటి కోసం స్వచ్ఛమైన ఆర్వో వాటర్ అందించాల్సిన బాధ్యత బంక్ యాజమాన్యందే. ఎవరైనా ఉచితంగా ఆ నీటిని వినియోగించుకోవచ్చు. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే ఉపయోగించు కునేందుకు ప్రథమ చికిత్స అందుబాటులో ఉండాలి. అత్యవసర సమయంలో ఉపయోగించుకునేందుకు ఫోన్ సౌకర్యం ఉండాలి.
- పెట్రోల్, డీజిల్ నాణ్యతపై అనుమానం ఉంటే బంక్‌లోనే పరీక్షించుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ పరీక్షలకు కావాల్సిన పరికరాలు, ఫిల్టర్ కాగితాలు అందజేయాల్సిన బాధ్యత కూడా బంక్ సిబ్బందిదే. ఇంధనం తక్కువగా వచ్చినట్లు అనుమానం వస్తే అక్కడే చెక్ చేసుకోవాలి.
- వినియోగదారుల ఫిర్యాదు కోసం ప్రత్యేకంగా పెట్టె ఏర్పాటు చేయాలి. పెట్రోల్ బంక్‌లో సరైన సౌకర్యాలు లేనట్లయితే సిబ్బంది దురుసుగా ప్రవర్తించినా సంబంధిత చమురు సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు.

భారత్ పెట్రోలియం (బీపీసీఎల్) టోల్ ఫ్రీ నంబర్ 1800224344, ఇండియన్ ఆయిల్ (ఐఓసీఎల్) 18002333555, హెచ్‌పీఎల్ 18002333555, రిలయన్స్ 18008919023 నంబర్లకు ఫోన్ చేసి మీ సమస్యను తెలియజేయవచ్చు. వినియోగదారుల హక్కులను పరిరక్షించుకోవడం అందరి బాధ్యత. పెట్రోల్ బంక్‌ల్లో అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవడం ద్వారా మీ ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చుకోవచ్చు.

కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధిగా సురేష్

ఇల్లంతకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వెల్జిపూర్ గ్రామానికి చెందిన గండికోట సురేష్‌ను కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమిస్తున్నట్లు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మానకొండూర్ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం నియామక పత్రాన్ని అందించారు. పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకవెళ్లాలని ఎమ్మెల్యే సూచించినట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ వెంటకరమణారెడ్డి అధికార ప్రతినిధిగా నియామకం అయిన సురేష్‌ను అభినందించారు.

కొప్పుల అక్రమ ఆస్తుల చిట్టాను బయటకు తీస్తాం

- మిగతా మంత్రుల్లాగా ఈ ప్రాంతాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేదు?
- 2014 నుంచి అక్రమ కేసులు పెట్టి రాక్షస పాలన చేసింది నీవు కాదా?
- 15 నెలల్లోనే మా ప్రభుత్వంపై ఆక్రోశం ఎందుకు?

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, మే 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ రాష్ట్ర వ్యాప్తంగా కూడగట్టిన అక్రమ ఆస్తుల చిట్టాను బయటకు తీస్తామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధర్మారం, వెల్గటూర్ మండలాల కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తలతో గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లను సందర్శిద్దామని, అక్కడి మంత్రులు చేసిన అభివృద్ధిని తోటి మంత్రిగా ధర్మపురి నియోజకవర్గాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేకపోయారో చెప్పాలని ప్రశ్నించారు.

ధర్మపురి నియోజకవర్గ డీఎంఎఫ్‌టీ నిధులు 15 వందల కోట్లు సిద్దిపేటకు, 2 వేల కోట్లు గజ్వేల్‌కు తీసుకుపోతుంటే ఎందుకు మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీష్‌రావు మేడారంలో రాత్రిళ్లు బస చేసి మన నీళ్లను సిద్దిపేటకు తీసుకపోతుంటే కొప్పుల ఎందుకు అడ్డుకోలేదని అడ్లూరి ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రిగా ఉండి నియోజకవర్గానికి చేసిన ఒక్క పని చూపించాలని ఎద్దేవా చేశారు. మీ పాలనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రతీ ఒక్కరిపై అక్రమ కేసులు పెట్టారని, సామాన్య ప్రజలనుంచి నీకు వ్యతిరేకంగా వార్తలు రాసిన రిపోర్టర్ల దాక కేసులు పెట్టి వేధించావని గుర్తుచేశారు. ప్రభుత్వం వచ్చి 15 నెలల కాలంలోనే మీకు ప్రభుత్వంపై, నాపై అంతా ఆక్రోశం ఎందుకని, మరో మూడు సంవత్సరాల వరకు 10 ఏండ్లలో నీవు చేయని అభివృద్ధిని నేను చేసి చూపిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.


తనపై పెట్టిన కేసుల వివరాలను చూపిస్తున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్ మండలంలోని పాశి గామలో ఇథనాల్ ప్రాజెక్ట్‌ను ప్రతిపక్ష నాయకుడిగా నేను వ్యతిరేకిస్తే నాపై అక్రమ కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై పెట్టిన నాన్ బేయిలేబుల్ కేసుల ప్రతులను సమావేశంలో అడ్లూరి ప్రదర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన రైతులకు చొప్పదండి నియోజకవర్గంలో ఎకరాకు 20 లక్షలు ఇప్పిస్తే, ఇక్కడి రైతులకు 7 లక్షల నష్టపరిహారం ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటని, మీకు మెగా కంపెనీకి ఉన్న లోపాయికార ఒప్పందం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2004 నుంచి 2023 వరకు కొప్పుల రాష్ట్ర వ్యాప్తంగా సంపాదించిన అక్రమ ఆస్తులను, హైదరాబాద్ శివారులోని స్టోన్ మెటల్ క్వారీస్ సంబంధించిన వివరాలు ప్రజలు ముందు పెడుతామన్నారు.బీఆర్‌ఎస్ కార్యకర్తలను రెచ్చగొట్టి మాజీ మంత్రి ఉసిగొల్పుతున్నారని, కాంగ్రెస్ కార్యకర్తలు సంయమనం పాటించి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తె స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలే బుద్ధిచెప్తారని హితకు పలికారు.

28న తెలంగాణ ఉద్యమకారులకు సన్మానం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐలయ్య యాదవ్

పెద్దపల్లిటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు సన్మాన కార్యక్రమాన్ని ఈనెల 28న ఏర్పాటు చేశామని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ పేర్కొన్నారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, శాసనసభ్యులు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ భానుప్రసాద్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ హాజరవుతారని తెలిపారు. ఉద్యమకారులు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. నూనె రాజేశం రాజు, కందుల సదాశివ్, దబ్బెడ చంద్రకళ, అనుముల కళావతి, లలిత ఠాగూర్, కర్నాటి సీత, పాల్గొన్నారు.

24న ఆన్‌క్యాంపస్ రిక్రూట్‌మెంట్



క్యాంపస్ డ్రైవ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

పెద్దపల్లి కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 24న ఆన్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. బీటెక్, ఎంబీ ఏ ఉత్తీర్ణులైన 2022, 2023, 2024 విద్యార్థులు ప్రస్తుతం చివరి సంవత్సరం ఇంజనీరింగ్, ఎంబీఏ చదువుతున్న విద్యార్థులు పాల్గొనాలని పేర్కొన్నారు. హాజరయ్యేవారు 6సెట్ల ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకు రావాలన్నారు. అకాడిమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.గణేష్, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

రామగిరి, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలో 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏఆర్ఎస్‌కె బేగంపేట్‌లో 95 క్వింటాళ్లు, డీసీఎంఎస్ కల్వచర్లలో 70 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు ఉన్నాయని పేర్కొన్నారు. సబ్సిడీ మినహాయింపు పోను 30 కేజీల బ్యాగ్‌కు రూ.2137.5 చెల్లించాలని రైతులకు సూచించారు. పట్టాదారు పాస్‌బుక్కు, ఆధార్‌కార్డుతో విత్తనాలు తీసుకోవాలని తెలిపారు. పచ్చి రొట్టె ఎరువులు అయిన జీలుగ విత్తనాలు వాడటం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. వివరాలకు విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జీలుగ విత్తనాలు 250 క్వింటాళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి అనూష ఒక ప్రకటనలో తెలిపారు. 50శాతం రాయితీతో పొందవచ్చని, 30 కిలోల బస్తా రెండున్నర ఎకరాలకు సరిపోతుందన్నారు. వరి, మిరప సాగుచేసే రైతులు పచ్చిరొట్ట విత్తనాలు తొలకరిలో దుక్కి దున్ని 45 రోజుల తర్వాత భూమిలో కలియదున్నితే భూమి సారవంతమై దిగుబడి పెరుగుతుందన్నారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డ్‌తో విస్తరణ అధికారి సంప్రదించాలన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం

సుల్తానాబాద్, మే 20: (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే మందులను క్రమం తప్పకుండా వాడుతూ, రాష్ట్ర స్మాల్ సేవింగ్స్ అసోసియేషన్ ఇచ్చే పౌష్టికాహారంతో క్షయ వ్యాధిగ్రస్తులు ఆరోగ్యవంతులుగా అవుతారని జిల్లా మహిళా సాధికారత ఉమ్మడి కరీంనగర్ జిల్లా కో ఆర్డినేటర్ అరుణ ప్రభంజన్ అన్నారు. గర్రెపల్లి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం 500 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. రోగులకు వ్యాధి త్వరగా నయం కావడానికి రాష్ట్ర స్మాల్ సేవింగ్స్ అసోసియేషన్ ఒక్కొక్క రోగికి ఏడు వందల రూపాయల విలువ గల పౌష్టికాహార దినుసులను సమకూర్చగా అభయ సంస్థ ద్వారా పంపిణీ చేశామన్నారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయ్ కుమార్,వజ్ర సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైన్ నిర్మాణ పనులు ప్రారంభం

కోల్‌సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఇందిరానగర్ నుంచి సప్తగిరికాలనీ ప్రధాన నాలా ఆధునికీకరణ పనులు మంగళవారం మళ్లీ ప్రారంభమయ్యాయి. కార్పొరేషన్ అధికారులకు, కాంట్రాక్టర్లకు మధ్య సమన్వయ లోపంతో పనులు నిలిచిపోగా స్థానికులు ఇబ్బందులు పడ్డారు. మార్కండేయకాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన కమిషనర్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ, ఇంజనీర్లు, కాంట్రాక్టర్లతో మాట్లాడారు. వెంటనే పనులు ప్రారంభించాల్సిందిగా ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో మంగళవారం కార్పొరేషన్ డీఈ జమీల్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ నవీన్ మార్కింగ్ చేసి, డ్రైన్‌లోని ఆక్రమణలను తీసివేయించారు. వర్షాకాలం దగ్గర పడుతుండడంతో డ్రైన్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ విధానాలను మానుకోవాలి

సుల్తానాబాద్, మే 20: (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక, కార్పొరేట్, మతోన్మాద విధానాలను మానుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో మంగళవారం దేశ వ్యాప్త నిరసన కార్యక్రమాల్లో భాగంగా ప్లకార్డులు ధరించి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ముత్యంరావు మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెను జూలై 9కి వాయిదా వేశామన్నారు. పహల్గాం ఉగ్రదాడుల హత్యాకాండ, కశ్మీర్లో నెలకొన్న పరిస్థితులతో సమ్మెను వాయిదా వేశామని, కేంద్రం లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలన్నారు. నాయకులు లక్ష్మణ్, మల్లేశ్, సురేష్, వినోద్, రామ్మూర్తి, మధు, చంద్రయ్య పాల్గొన్నారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం(జేఏసీ) ఆధ్వర్యంలో ఎన్టీపీసీ ప్రాజెక్టు వద్ద యూనియన్ల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ నాయకులు కేంద్రం వైఖరిని నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కేంద్రం కార్మిక చట్టాలను సవరించి 4 లేబర్ కోడ్లను తీసుకు వచ్చేందుకు కుట్ర చేస్తోందన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు నెలకు 26 వేల రూపాయల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. యునైటెడ్ ఫోరం నాయకులు భూమల్ల చందర్, నాంసాని శంకర్, చిలుక శంకర్, పాల్గొన్నారు.

పాస్టర్ ప్రభాకర్ సేవలు చిరస్మరణీయం

మంథని, మే 20 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ సమాజానికి పాస్టర్ ప్రభాకర్ అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన అకాల మరణం అందరికి తీరని లోటని ఐఎంఐ సెక్రటరీ అంకరి కుమార్ అన్నారు. స్థానిక సీయోను చర్చిలో మంగళవారం జరిగిన పాస్టర్ ప్రభాకర్ కుటుంబ ఆదరణ కూడిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంథని ప్రాంతంతోపాటు క్రైస్తవ సమాజంలోని వివిధ సంస్థలకు పాస్టర్ ప్రభాకర్ అనేక సేవలు అందించారన్నారు. ఈకార్యక్రమంలో పాస్టర్ ప్రభాకర్ కుటుంబ సభ్యులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

భూ భారతి చట్టం.. మీ ఇంటి చుట్టం

(5వ పేజీ తరువాయి)

అన్నారు. భూభారతి చట్టాన్ని సీఎం కోసమో, మంత్రులు, ఎమ్మెల్యేల కోసమో తీసుకరాలేదన్నారు. 18 రాష్ట్రాల్లో అమలవుతున్న రెవెన్యూ చట్టాలను అధ్యయనం చేసి ప్రజల ఆలోచన మేరకు చట్టాన్ని తీసుకవచ్చామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 98,654 డబుల్ బెడ్ రూముల ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని, 60 వేల ఇళ్లు పూర్తి చేశారని, 30 వేల ఇళ్లు మొండి గోడలుగా దర్శనమిస్తున్నాయన్నారు. ప్రస్తుతం నియోజకవర్గానికి 3,500 చొప్పున 4,50,00 ఇళ్లు మంజూరు చేశామని, ఈ నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా సన్న బియ్యం ఇస్తున్నామని, అనేక పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, పెద్దపల్లి, సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు ఈర్ల స్వరూప, మినుపాల ప్రకాశ్ రావు,అదనపు కలెక్టర్ డి వేణు, రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, తహసిల్దార్ బషీరుద్దీన్, మార్కెట్ చైర్మన్ లు సంజీవ్, తిరుపతి రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

చీము, నెత్తురు ఉంటే నాతో రండి..

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



ధాన్యం కొనుగోళ్ల విషయంలో విమర్శిస్తున్న బీఆర్ఎస్, బీజేపీ నాయకులు దమ్ముంటే, చీము, నెత్తురు ఉంటే పెద్దపల్లికి రావాలని, ఏ కేంద్రానికైనా వెళ్లి కొనుగోళ్లు ఎలా సాగుతున్నాయో రైతులను తెలుసుకుందామని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి చట్టం వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారని, వాటి పరిష్కారమే లక్ష్యంగా భూ భారతి చట్టం తీసుకొచ్చిందన్నారు. గతంలో ధాన్యం కొనుగోలు పేరుతో రైతులకు నష్టం జరిగిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సంవత్సరానికి దాదాపు కోటి మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. జిల్లాలో గత పాలకుల హయాంలో లక్షా 44 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ప్రస్తుతం 2 లక్షల 90 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని తెలి పారు. ఇందుకు కృషి చేసిన కలెక్టర్, యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్



రామగుండంలో మండలం, రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ కోరారు. మంత్రులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారం దిశగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పని చేస్తున్నారని తెలిపారు. రామగుండం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని, నగరానికి అదనంగా మరో తహసీల్దార్ కార్యాల యం, అంతర్గాం కాందిశీకులు సమస్య పరిష్కరించాలని, జెన్కో, సింగరేణి తరపున గతంలో 18 వేల పట్టాలు పంపిణీ చేశామని, మరో 15వేల పట్టాలు పెండింగ్‌లో ఉన్నాయని, పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ధరణితో రైతులు ఇబ్బందులు పడ్డారు

- ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద రావు



గత ప్రభుత్వం తీసుకవచ్చిన ధరణి పోర్టల్‌తో రైతులు ఇబ్బందులు పడ్డారని, భూభారతి చట్టం మేలు చేయనున్నదని ఎమ్మెల్సీ అన్నారు. గతంలో రెవెన్యూ అధికారులకు భూములను పరిష్కరించే అధికారం లేద ని, ఇప్పుడు ఆర్డీఓలు, అదనపు కలెక్టర్లకు అధికారాలు ఇచ్చారన్నారు. ఎన్నో ఏళ్లుగా జర్నలిస్టులు ఇళ్ల స్థలాలు ఇళ్ల కోసం పోరాటం చేస్తున్నారని వారి సమస్యను పరిష్కరించాలని మంత్రులను కోరారు.

భూ సమస్యల పరిష్కారానికి భూభారతి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



భూ సమస్యలు శాశ్వత పరిష్కారం చేసే దిశగా ప్రభుత్వం భూ భారతి పోర్టల్ ప్రారంభించిందని, ఈ చట్టంపై సందేహాల నివృత్తికి అవగాహన సమావేశాలు విజయవంతంగా నిర్వహించామని కలెక్టర్ అన్నారు. ఎలిగేడు మండలం పైలట్‌గా ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద 1950 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, ఇందులో 700 ఇండ్ల వరకు బేస్మెంట్ స్థాయి నిర్మాణం జరిగిందన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై మంత్రుల సానుకూల స్పందన

ఎలిగేడు, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేసే విషయమై రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారు. రెవెన్యూ సదస్సుకు హాజరైన మంత్రులకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్ర సంపత్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. జిల్లాలో పని చేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ 250 గజాల ప్రభుత్వ స్థలంతోపాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. రూ.10 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించాలని, వివిధ కారణాల వల్ల మృతి చెందే జర్నలిస్టులకు రూ.10 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అక్రిడిటేషన్ కార్డు గల జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే విధంగా చొరవ చూపాలని, ప్రెస్‌భవన్‌ల కోసం స్థలాలు కేటాయించి భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. మంత్రి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఎక్కడెక్కడ ప్రభుత్వ స్థలాలు ఉన్నాయో గుర్తించాలని కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఫోన్‌లో ఆదేశించారు. పెద్దపల్లి, రామగుండం శాసనసభ్యులు మాట్లాడుకుని సమస్య పరిష్కరించాలన్నారు.

కమ్యూనిటీ హాల్ పనులకు భూమి పూజ



కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, మే 20: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ తల్లి దేవాలయం వద్ద గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే విజయరమణారావు భూమి పూజ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్‌తో పాటు గౌడ సంఘం ప్రతినిధుల కోరిక మేరకు ఎమ్మెల్యే సీడీపీ గ్రాంట్ నుంచి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి పది లక్షలు మంజూరు చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి చేశారు. పనులు ప్రారంభించాలని, భవిష్యత్‌లో మరిన్ని నిధులు మంజూరీ చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, మాజీ జడ్పీటీసీ సారయ్య గౌడ్, మాజీ సర్పంచ్ పుష్పలత, చిలుక సతీష్, గౌడ సంఘ నేతలు తిరుపతి, శ్రీనివాస్, లచ్చయ్య, సాగర్, లక్ష్మన్, చిరంజీవి, రమేష్ పాల్గొన్నారు.

సంఘం భవన నిర్మాణానికి సహకరిస్తా

కళ్యాణ్‌నగర్, మే 20(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పవర్‌హౌస్ కాలనీలో ఉన్న మున్నూరుకాపు భవన నిర్మాణానికి తన వంతు సహకారాన్ని అందిస్తానని ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్ చెప్పారు. మంగళవారం పవర్‌హౌస్‌కాలనీలోని నాగులమ్మ ఆలయాన్ని ఆమె సందర్శించి పూజలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మున్నూరుకాపు సంఘ భవన నిర్మాణానికి మక్కాన్ సింగ్ సేవా సమితి ద్వారా సహకారాన్ని అందిస్తానని తెలిపారు. ముచ్చకుర్తి చంద్రమౌళి, లక్కం బిక్షపతి, మీసాల సతీష్, కృష్ణ, వెంకటేశ్వర్లు, తిరుపతి ఉన్నారు.

మంత్రిని విమర్శించే హక్కు మధుకు లేదు

ముత్తారం, మే 20 (ఆంధ్రజ్యోతి): మంత్రి శ్రీధర్ బాబు కుటుంబాన్ని విమర్శించే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు లేదని మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పుట్ట మధుకు రాజకీయ భవిష్యత్తు ఇచ్చింది దుద్దిళ్ల కుటుంబమన్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ శైలజరామయ్య మీ ప్రభుత్వంలో పది సంవత్సరాలు నిబద్ధతతో పనిచేశారన్నారు. చొప్పరి సదానందం, దొడ్డ బాలాజీ, మద్దెల రాజయ్య, వాజీ పాషా, యాదగిరిరావు పాల్గొన్నారు.

సామర్థ్యాల పెంపునకే ఉపాధ్యాయులకు శిక్షణ

ధర్మారం, మే 20 (ఆంధ్రజ్యోతి) ఉపాధ్యాయుల్లో బోధన నైపుణ్యాల అభివృద్ధితోపాటు సామర్థ్యాల పెంపునకే శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని కోర్స్ డైరెక్టర్, ఎంఈవో పోతు ప్రభాకర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు వారి వారి నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు శిక్షణ ఎంతో దోహద పడుతుందన్నారు. బోధన పద్ధతుల్లో నూతన ఆవిష్కరణలు, విద్యార్థుల్లో చదవడం, రాయడం, చతుర్విత ప్రక్రియల్లో ఎంచుకోవాల్సిన వ్యూహాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, విద్యలో టెక్నాలజి వినియోగంలో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. రిసోర్స్ పర్సన్స్ జాడి శ్రీనివాస్, గుర్రాల గంగారెడ్డి, ఈగం సంతోష్ కుమార్, హైమావతి, గంకిడి వెంకట రమణారెడ్డి, సిరిపురం సునీల్, ఆడిచర్ల సతీష్, బి.జలపతి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంతోషం మల్లారెడ్డి, నూతి మల్లన్న, మోతిలాల్ నాయక్, రాములు, స్వామినాయక్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మండలంలోని 43 పీఎస్, 9 యూపీఎస్ పాఠశాలల్లో పని



మాట్లాడుతున్న ఎంఈఓ మహేష్

చేస్తున్న 91 మంది ఎస్‌జీటీలకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తెలుగు, ఆంగ్లం, పరిసరాల విజ్ఞానం ఇతర అంశాల పై ఆర్పీలు బోధన అభ్యాసన ప్రక్రియల పై, మూల్యాంకనం పై శిక్షణ ఇస్తున్నారు. పేరెంట్, టీచర్స్ మీటింగ్, ఏఐ, గ్రంధాలయం అంశాల పై శిక్షణ ఇస్తున్నారు. ఎంఈవో దాసరి లక్ష్మి, ఆర్పీలు రమేష్, లోకే రాజ్‌పవన్, చంద్రశేఖర్, లక్ష్మయ్య, లక్ష్మణ్, కిషోర్, రాము, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్,(ఆంధ్రజ్యోతి): బోధన విధానాల పై ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభమైందని మండల విద్యాధికారి సిరిసిల్ల మహేష్ తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఉపాధ్యాయుల్లో బోధన సామర్థ్యాల పెంపు, కృత్రిమ మేధాబోధన, ఇతర అంశాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. తల్లి దండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు. ఆర్పీలు సదయ్య, స్వప్న, మల్లికార్జున్, వేణు, కుమార్, దేవేందర్, భానుచందర్, రాజేందర్ పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): బోధనాభ్యసన ప్రక్రియలను పకడ్బందీగా అమలు చేస్తూ ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసి (ఎఫ్ఎల్ఎన్) ఫలితాల్లో వచ్చే విద్యా సం వత్సరంలో జిల్లాను అగ్రభాగాన నిలపాలని జిల్లా రిసోర్స్ పర్సన్ ఈర్ల సమ్మయ్య కోరారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎంఈఓ రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎంఈఓ మాట్లాడుతూ ఐదు రోజుల ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో అనేక విషయాలపై అవగాహన పొంది, వాటిని పాఠశాలల్లో అమలు చేయాలని కోరారు. రిసోర్స్ పర్సన్లు మంద గట్టయ్య, రౌతు కవీశ్వర్, ఎ.కిరణ్, పుల్లూరి శ్రీనివాస్, ఎస్. సత్యనారాయణ, ఎ.చేరాలు, పి.అశోక్, సురేష్, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది వెంకటేష్, కుమారస్వామి, సిఆర్పిలు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్



పెద్దపల్లి కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలలో జిల్లా విద్యార్థినులు అద్భుత ప్రదర్శన కనబరిచారని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అంతర్జాతీయస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలలో ప్రదర్శన కనబరిచిన జిల్లా విద్యార్థినులను కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17, 18 తేదీలలలో ఉత్తరాఖండ్, హరిద్వార్ ఓకేనావ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలలో పెద్దపల్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచారని అన్నారు. అంతర్జాతీయ కరాటే పోటీలలో మహాత్మజ్యోతిబాపూలే విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. అండర్ 14కటాస్ కుమితి విభాగంలో టి.శరణ్య బంగారు, వెండి పతకం, టి.రక్షిత వెండి, కాంస్య పతకం, యు.కీర్తన వెండి, కాంస్య పతకం సాధించారని తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థినులను కలెక్టర్ అభినందించారు. కరాటే మాస్టర్ కర్ర వెంకటేష్, ప్రిన్సిపాల్ మనిదీప్తి, ఇన్స్ట్రక్టర్ అలేఖ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ భూములను కాపాడాలి

ఎలిగేడు, మే 20 (ఆంధ్రజ్యోతి): ముప్పిరితోటలోని పురాతనమైన వేంకటేశ్వరస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని గ్రామస్థులు రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. 400ఏళ్ల చరిత్ర గల ఆలయం చుట్టూ పక్కల ఉన్న భూములను అన్ని కులాలకు చెందినవారు విరాళంగా ఇచ్చామని, రామిడి వెంకట్‌రామ్‌రెడ్డితోపాటు అతని కుటుంబ సభ్యులు స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తూ భూములను స్వాధీనపర్చుకొని విక్రయానికి పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వే నంబర్ 409లో 3.30, 417లో 1.27 ఎకరాలను కబ్జా చేశారని, ఈ భూములన్నీ ఆలయానికి చెందినవని పేర్కొ న్నారు. విచారణ జరిపి ఆలయానికి కేటాయించాలని కోరారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల సమ్మె

మంథని, మే 20 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీలో పని చేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్లు సమ్మెను కొనసాగిస్తున్నారు. రెండు రోజులుగా వారు సమ్మెకు దిగారు. వేతనాలు, బస్సుల సంఖ్యలను పెంచాలని వారు డిమాండ్ చేశారు. అద్దె బస్సుల డ్రైవర్లు, సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

రామగిరి, మే 20(ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణను యజ్ఞంలా చేయాలని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. మంగళవారం ఆర్జీ-3, ఏపిఏ డివిజన్‌ల పరిధిలోని సెంటినరీకాలనీ ప్రాజెక్టు కార్యాలయంలోని ఎంవిటిసి శిక్షణ కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభోత్సవానికి మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా 38 కోర్సులను ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీతో పాటు బీటెక్, ఐటీ టెక్నికల్ కోర్సులు పూర్తి చేసిన వారికి ఐటీ విభాగం నుంచి టాస్క్ సెంటర్‌లతో ఎంవోఈ ఒప్పందం చేస్తామని తెలిపారు. పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యతను పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నైపుణ్యానికి సంబంధించి విశ్వ విద్యాలయం ప్రారంభించారని పేర్కొన్నారు. నైపుణ్యం కలిగిన ఉద్యోగులు కావాలని కంపెనీలు కోరుతున్నాయని, అందులో భాగంగానే



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, పాల్గొన్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, అధికారులు

యువతకు సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి వచ్చారు... ప్రారంభించారు... పోయారు అనే వాదనలకు తావు లేకుండ సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సూచించారు. నైపుణ్యతను పెంచే ప్రయత్నం మీరు చేయండి అందుకు ప్రభుత్వపరంగా అం డగా ఉంటామని సింగరేణి అధికారులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, జీఎం హెచ్‌ఆర్‌డి రఘుపతి ఆర్జీ-1,3, ఏఎల్‌పి జీఎంలు లలిత్‌కుమార్, సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావు, ప్రాజెక్టు అధికారి సిహెచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సీఎంపీఎఫ్ కార్యాలయం ముట్టడి



సీఎంపీఎఫ్ కార్యాలయాన్ని ముట్టడించిన కాంట్రాక్టు కార్మికులు

గోదావరిఖని, మే 20(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ లెక్కల పుస్తకాలు, చిట్టీలను ఇవ్వాలంటూ మంగళవారం ఐటీ కాలనీలోని సీఎంపీఎఫ్ కార్యాలయాన్ని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ముట్టడించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రహ్మానందం మాట్లాడుతూ సింగరేణిలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు మూడు సంవత్సరాలుగా సీఎంపీఎఫ్ చిట్టీలు ఇవ్వడం లేదని, దీంతో కార్మికులు ఆవేదనకు గురవుతున్నారని, సీఎంపీఎఫ్‌కు ఎంత డబ్బులు జమ అయ్యాయనే వివరాలు నేటికీ ఇవ్వలేదన్నారు. కొందరు కార్మికులు పని నుంచి దిగిపోయిన, మృతి చెందిన డబ్బులు ఎంత కట్టింగ్ చేశారో వివరాలు ఇవ్వడం లేదని, ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం, సీఎంపీఎఫ్ అధికారులు కాంట్రాక్టు కార్మికుల లెక్కల వివరాలను అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఎంపీఎఫ్ అధికారులకు వినతి పత్రం అందించారు. నాయకులు నరేష్, వెంకన్న, అశోక్, రాజేశం, రామకృష్ణ, విజయలక్ష్మి, బుచ్చమ్మ, రాజేశ్వరి, రవి కుమార్, ఓదెలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పుచ్చలపల్లి సుందరయ్యకు సీఐటీయూ నివాళి



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఫైటింక్లయిన్‌కాలనీ, మే20(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు నాయకుడు దివంగత పుచ్చలపల్లి సుందరయ్యకు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నివాళులర్పించారు. మంగళవారం యూనియన్ అధ్యక్షుడు తుమ్మలరాజారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యంరావులు మాట్లాడారు. సుందరయ్య బాల్యం నుండి సామాజిక, ఆర్థిక సమస్యలపై గ్రామస్థాయిలోనే పోరాటాలు చేశారని తెలిపారు. స్వాతంత్రోద్యమంలో క్రియాశీలకంగా పని చేశారని పేర్కొన్నారు. తెలం గాణ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించి, ప్రజా మద్దతుతో అసెం బ్లీ, పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యాడని, సైకిల్ మీద పార్లమెంట్‌కు వెళ్లిన నిరాడంబర నాయకుడని తెలిపారు. యూనియన్ ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్, ఆర్జీ-3 అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, నాయకులు రాంప్రసాద్, భూమయ్య, చంద్రశేఖర్, లక్ష్మీరాజం, పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉన్న బొగ్గు స్వాధీనం

కోల్‌సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): ఎల్కలపల్లి గేట్ సమీపంలోని పోచమ్మ గుడి, ఇందిరానగర్ సమీపంలో మంగళవారం సింగరేణి ఎస్అండ్‌పీసీ సిబ్బంది నిల్వ ఉన్న బొగ్గును స్వాధీనం చేసుకున్నారు. ఎన్టీపీసీకి రవాణా అయ్యే వ్యాగన్ల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బొగ్గును చోరీ చేసి దాచినట్టు గుర్తించారు. సుమారు 6టన్నుల బొగ్గును స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్లు, ఏసీటీఎస్, ఇంటెలిజెన్స్ సిబ్బంది ఉన్నారు.